


# పొద్దు తిరగని పూలు

## – శ్రీ రుద్ర

*(గత సంచిక తరువాయి)*

**నేను పుట్టి ఏమి** సాధించానో తెలియదు. కానీ ఎన్నో కష్టాలకోర్చి జీవితాన్ని ఎదుర్కుంటున్న అక్కకిక నా వల్ల ఇబ్బంది కలగకూడదని తిరుగులేని కఠిన నిర్ణయం తీసుకున్నాను. ఇంతవరకూ నేను పట్టుదలగాఏమీ సాధించకపోయినా జీవితంలో అక్కకిచ్చిన బాస మాత్రం తప్పకూడదని దృఢ సంకల్పం తీసుకున్నాను.

రాఘవ బావ కూడా ఇంత కఠినమైన నిర్ణయం తీసుకోవద్దని ఎంతో చెప్పాడని నాకు తర్వాత తెలిసింది. కానీ అక్క దీని గురించి ఏమీ మాట్లాడవద్దంది. నా వల్ల వాళ్ళెవరూ ఇకపై అవస్థ పడబోరని గట్టిగా చెప్పింది. తన కుటుంబం నిత్యం తిట్టుకునో, అసహ్యించుకునో లేక అవమానపరిచే స్థితిలోనో నన్ను అక్క చూడదల్చుకోలేదు. అందుకే తన జీవితకాలం కుమిలిపోయే కఠోర నిర్ణయాన్నిఅక్క తీసుకుంది.

ఈ సంఘటన జరిగిన ఏడాదికి నాకొక వార్త తెలిసింది.

జోగారావు చెప్పాడు నా పెద్ద మేనకోడలు లక్ష్మికి పెళ్లి సంబంధం కుదిరిందని, తిరుపతిలో పెళ్లి చేస్తున్నారని. "మేనమామవి నువ్వు లేకుండా లక్ష్మి పెళ్లి ఎలా చేస్తారని" జోగారావు ఇంకేదో చెప్పబోతుండగా నేను వారించాను దీని గురించి ఇంకేమీ చెప్పద్దని.

జోగారావునైతే వారించాను కానీ నా మనస్సు ఎంతో వికలమైంది. నేనంటే ఆప్యాయంగా ఉండే లక్ష్మికి మేనమామగా నా బాధ్యత తీర్చకపోగా కనీసం దాని పెళ్ళైనా చూడలేక పోతున్నానని. మళ్ళీ నాకు నేనే సర్దుకున్నాను పెళ్ళికి ఆహ్వానమే పంపనప్పుడు నేనేం చేస్తానని.

దీని గురించి తెలిసిన దుర్గ ఉండబట్ట లేక అక్క దగ్గరకి వెళ్తానంది. కానీ పిలవని పెళ్ళికి మనం వెళ్ళకూడదని ఇంకా నా వాగ్దానం గురించి కూడా దుర్గకి గుర్తు చేసాను. దుర్గకివేమీ పట్టదు. తన ధోరణిలోనే ప్రవర్తిస్తుంది. నేను అక్కకి మాటిచ్చి వెళ్లకపోయినా అత్యవసరమైనప్పుడల్లా అది చాటుగా అక్కని కలిసి నాకు తెలియకుండా ఏదో సహాయం తీసుకుంటూనే ఉండేది.

కాలం గడుస్తోంది. ఎప్పుడైనా సీతాఫలమండికి వెళ్తే వంశీ కనపడినా వాడు మాత్రం నన్ను చూసి కూడా చూడనట్లే తప్పుకునే వాడు.

నా తిప్పలేవో నేను పడుతూ నాకు లభించిన చిన్న ఉద్యోగ అవకాశాలను ఉపయోగించుకుంటూ జీవనం సాగిస్తున్నాను. నా ఇద్దరు ఆడపిల్లలు కూడా ఏవో వానాకాలం చదువులు చదువుతూ పెరిగి పెద్ద వాళ్లవుతున్నారు.

రాఘవ బావ తన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా తన స్వంత ఇల్లు అద్దె కిచ్చి సికింద్రాబాద్ ఆఫీసుకి దగ్గరగా రైల్వే క్వార్టర్స్ కి మకాం మార్చాడు. రాఘవ బావ కూడా కొన్నేళ్లుగా ట్రైన్ టికెటింగ్ పర్యవేక్షణ విభాగంలోకి మారాడు. అందువల్ల తరచు ఆడిట్ పనులకు బయట ఊళ్లకు టూర్లో ఉండడం వలన నేను బావను ఆఫీసులో కూడా కలిసే అవకాశం లేక పోయింది.

దీనితో నేను అక్క కుటుంబానికి పూర్తిగా దూరమై కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. నాకు అక్క కుటుంబం విశేషాలు ఏమీ తెలియకుండా పోయాయి. అక్క కుటుంబానికే కాదు అమ్మా వాళ్లకి కూడా నేను ఇంచుమించు లేని వాడినే అయ్యాను.

కొన్నాళ్ళకి వంశీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి హైదరాబాదులో చాలా మంచి ఉద్యోగంలో చేరాడని, అలాగే నా రెండవ మేనకోడలు దామిని పెళ్లి కూడా జరిగిందని సీతాఫలమండిలో బంధువులు చెప్పారు. దామిని పెళ్ళైన మూడేళ్ళకి ఈ మధ్యనే అక్కా వాళ్ళు వంశీ పెళ్లి కూడా చేశారని తెలిసింది.

బావ ఇంకా చిన్నవాడే. ఇంకొన్నాళ్ళు రైల్వేలో సర్వీస్ సమయం ఉంది. అందుకే నాకు సంతోషం వేసింది రాఘవ బావ తన బాధ్యతలన్నీ రిటైర్ అయ్యేలోగా త్వరగా పూర్తిగా నెరవేర్చాడని.

ఇన్నాళ్లూ ఎంతో కష్టపడి అక్కా బావా తమ పెద్ద కుటుంబ బాధ్యతలన్నీ సవ్యంగా పూర్తి చేసారు. ఇక వాళ్ళు ఆనందంగా కొడుకు కోడలితో కాలక్షేపం చేస్తారనుకున్నాను. కానీ ఆ అదృష్టం అక్కా బావలకి దక్కలేదు.

ఒక రోజు ప్రొద్దునే జోగారావు నా ఇంటి అడ్రస్ కష్టపడి తెలుసుకుని నన్ను కలిసి "బాబూ ప్రొద్దునే నీకొక దుర్వార్త చెబుతున్నాను. నన్ను క్షమించు ఇప్పటికే ఆలస్యమయ్యింది నీకు చెప్పటానికి" అన్నాడు.

దేవుడా! ఏం పరీక్ష పెట్టబోతున్నావు నాకు అనుకుంటూ "ఏమైంది జోగారావు?" అని అడిగాను.

"మీ రాఘవ బావ నిన్న ప్రొద్దున్నే అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి రైల్వే ఆఫీస్ లిఫ్ట్ లోనే ప్రాణాలు విడిచాడు. నీకు ఈ విషయం తెలియచేద్దామంటే ఎవ్వరికీ నీ అడ్రస్ తెలియదు. నిన్న సాయంత్రమే బన్సీలాల్ పేటలో అంత్య క్రియలు జరిగాయి" అన్నాడు జోగారావు.

నా గుండె పగిలింది. ఎంత ఘోరం జరిగిపోయింది బావా! నువ్వు కూడా నాన్నలాగే త్వరపడి ఈ లోకం నుండి తప్పుకున్నావా అని విల విలా ఏడ్చాను.

భగవంతుడా! నన్నెందుకు ఇలా శిక్షిస్తున్నావు? నాకెంతో ఇష్టమైన రాఘవ బావ కడచూపు కూడా దక్కనీయకుండా ఎందుకు చేసావు? నిన్ననే తెలిసి వుంటే కనీసం బావకి తన ఇంటి దగ్గర కాకపోతే స్మశానంలో నైనా శ్రద్ధాంజలి ఘటించి వీడ్కోలు పలికేవాడిని. నాకా ప్రాప్తం కూడా లేదని భోరుమన్నాను.

"ఊరుకో బాబూ! ఈ విషయం తెలియకపోతే నువ్వేం చేస్తావ్? నీ తప్పేం లేదు దీనిలో. నీకు చిలకలగూడ రైల్వే ఫంక్షన్ హాల్ తెలుసు కదా, దాని ప్రక్కనే ఉన్నపెద్ద క్వార్టర్స్ లోనే సుగుణా వాళ్ళుండేది" అని చెప్పి జోగారావు వెళ్లి పోయాడు.

నిరంతరం సమస్యలతో, బాధలతో మెదడు మొద్దు బారిన నాకు ఈ దుర్వార్త మాత్రం తట్టుకోలేని దుఃఖాన్నికలిగించింది. నేను చాలాసేపు తేరుకోలేకపోయాను.

"అక్కా! ఇంకా యాభై ఏళ్ళు కూడా చేరని నీకు ఈ దురదృష్టమేంటి. నీవైనా కష్టాలు తీరి సుఖంగా ఉంటా వనుకుంటే ఇలా జరిగిందేమిటి? నన్నిక ఎప్పటికీ కలవొద్దన్నావు, నిన్నెలా ఓదార్చేది. నీ ఒట్టుతో నన్ను కట్టేశావ్ ఇప్పుడు నేనేం చేసేది" అని గుండెలవిసేలా ఏడ్చాను.

ఇప్పటి దాకా విజయ్ బాబు స్వగతాన్ని బరువెక్కిన గుండెతో నిశ్చేష్టుడై వింటున్న నన్ను "ఏమిటి శ్రీమన్! వింటున్నావా నా మాటలు" అని విజయ్ బాబు అన్నట్లనిపించి చెమర్చిన కళ్ళతో "ఊఁ" అని కష్టమ్మీద బదులిచ్చాను.

"నన్నుఎంతో ప్రేమించే అక్కకి, ఆప్యాయంగా ఆదరించిన బావకి నన్నుఎప్పటికీ దూరం చేసిన వంశీని నేను క్షమించలేను. శ్రీమన్! నేను అక్కకిచ్చిన మాట తప్పలేదు. నువ్వు చెప్పు నీ మిత్రుడు వంశీ నాకెందుకింత మనస్తాపం కలిగించాడు?" అని విజయ్ బాబు రోదన నాకు వినిపించింది.

నా చేతుల చుట్టూ పెనవేసుకున్న తమల తీగ ధారాపాతంగా తన్నీరు స్రవిస్తోంది. నా ముక్కు పుటలు ఎగసి పడుతూ, గొంతు బిగుసుకుపోయి నేనూ ఏడుస్తున్నాను. కొంతసేపు నా నుంచి ఏమీ స్పందన లేదు.

విజయ్ బాబు తీవ్ర మనోవేదనని గ్రహిస్తున్న నాకు ఉన్నట్లుండి నన్ను పెనవేసుకున్న తమల తీగ ప్రక్కకి జరిగి క్రిందకి వాలినట్లనిపించింది. నాకు విజయ్ బాబు స్వరం వినిపించడం మానేసింది!!

"ఏంటి విజయ్ బాబు! చెప్పడం మానేసావేమిటి? మాట్లాడు" అని తరచి తరచి నేనంటుండగా,

"ఏంటండీ. ఎవరితో మాట్లాడుతున్నారు. మీలో మీరు మాట్లాడుతున్నారేంటి?" అని మా ఆవిడ నా చేయి పట్టుకుని అడుగుతుంటే ఉలిక్కిపడ్డ నేను "ఏమీ లేదు" అని అన్యమనస్కంగా ఇంట్లోకి నడిచాను.

ఇంట్లోకి వచ్చాననన్నమాటే కానీ విజయ్ బాబు స్వగతమే నన్నువెంటాడుతోంది. మర్నాడు తిరిగి తమల తీగ దగ్గరకి ఎంతో ఆదుర్దాగా వెళ్లిన నాకు అక్కడి దృశ్యం దిగ్భ్రాంతికి గురి చేసింది. పెరట్లో తమల తీగ చాలా వరకు

వదలిపోయి క్రుంగిపోయి ఉంది!

"విజయ్ బాబు, విజయ్ బాబూ!" అని ఆ రోజు ఎన్నిసార్లు ఆ తమల తీగ ప్రాంతం దగ్గర పిలిచినా నాకు విజయ్ బాబు స్వరం తిరిగి వినిపించలేదు.

విజయ్ బాబు తన కథని అసంపూర్తిగా మిగల్చడం నాకు విచిత్రంగా ఇంకా చాలా వెలితిగా అనిపించింది. ఆ తరువాత విజయ్ బాబుకి ఏమైంది అన్న సందేహాలతో ఉక్కిరిబిక్కిరైన నేను వంశీకి ఫోన్ చేసి జరిగిందంతా చెప్పాను.

వంశీ కూడా నివ్వెర పోయి "శ్రీమన్! ఇంతకీ ఏం చేస్తున్నావురా నువ్వు" అన్నాడు.

"డాక్టర్ సాబ్! రిటైర్ అయ్యాక సైన్స్ పరిశోధనలు మాని ఆత్మశోధనలు మొదలెట్టావా" అని ఎగతాళి చేసాడు.

"ఒరేయ్ నోరు ముయ్యరా! నేను చెప్పిందాంట్లో ఏదైనా కల్పితం ఉందా? ఈ సంఘటనలేంటో అర్థం గాక నేను సతమతమౌతుంటే వెటకారం చేస్తున్నావు.  నువ్వు ముందు అర్జెంటుగా ఇంటికి రా" అని వంశీని తిట్టాను.

ఇంతలో మా అమ్మాయి జ్యోతి "నాన్నా! నన్ను బయటికి తీసుకెళ్తానన్నావ్.  ఇప్పుడేంటి వంశీ అంకుల్ ని పిలిచావు" అనింది.

"మనం సాయంత్రం వెళదాం.  నువ్వు అంకుల్ కోసం కాఫీకి డికాక్షన్ తయారు చేయమ్మా" అన్నాను నేను.

కొద్ది సేపట్లోనే వంశీ వచ్చాడు.  జ్యోతి మాకు ఇచ్చిన కాఫీ త్రాగుతూ నేను పూసగుచ్చినట్లు నాకు కలిగిన అనుభవాన్ని, విజయ్ బాబు వినిపించిన తన స్వగతాన్నివివరించాను.

వంశీ అంతా విని " శ్రీమన్, ఇదంతా నీకు చాలా వరకు నా ద్వారా తెలిసిందే కదా!  ఆ జ్ఞాపకాలే నీకు తిరిగి స్ఫురణకొస్తున్నాయి" అన్నాడు.

నేను "ఒరేయ్! నన్నుపిచ్చి వాడిని చేయకురా.  కావాలంటే ఆ తమల తీగ దగ్గరకు వెళదాం పద" అని వంశీని పెరట్లోకి తీసుకెళ్ళాను.

"వంశీ చూడు! నీకు తెలుసు కదా క్రిందటి సారి నువ్వు వచ్చినప్పుడు ఇది ఎంత గుబురుగా పచ్చగా ఉండేదో.  రెండు రోజుల క్రితం నుంచే ఉన్నట్లుండి ఇలా కమిలిపోయి వాడిపోయింది" అన్నాను.

వంశీ పరిశీలనగా ఆ తీగని చూసి "ఒరేయ్! క్రింద చూసావా? ఈ తీగె వేళ్ళు నేలనుంచి ఊడిపోయి ఉన్నాయి" అందుకే అలా జరిగింది అన్నాడు.

నేను "కావచ్చేమో, కానీ అకస్మాత్తుగా ఎందుకు జరిగింది? నా అనుభవం మీద నమ్మకం కలగడం లేదు కదా.  ఔను లే! కర్కశుడివి ఇటువంటి అనుభూతి నువ్వెందుకు నమ్ముతావు" అని నిష్టురంగా అన్నాను.

నేను వేసిన నిందతో బాధపడ్డ వంశీ "సరే లేరా! నేను దుర్మార్గుడినే.  అనుబంధాలను అర్థం చేసుకోని

కఠినుడనే.  కానీ నా మనోగతం, ఇంకా అప్పటి నా పరిస్థితిని కూడా తెలుసుకోవాలి నువ్వు" అన్నాడు.

ఇక వంశీ ఇప్పుడు తన గతాన్ని, అప్పటి పరిస్థితులనూ విడమర్చి చెప్పడం మొదలు పెట్టాడు.

వంశీ మనోగతం

వంశీ నాతో ఇలా అన్నాడు

శ్రీమన్! ఆ రోజు నాన్నపోయిన నాడు, ఊహించని ఈ ఆకస్మిక దుర్ఘటనకి ఎవ్వరికీ ఏమీ తోచలేదు. తర్వాత కొద్దీ సేపటికి మావయ్య గుర్తుకు వచ్చినా ఎక్కడున్నాడో తెలియదు ఇంకా ఎవరికైనా చెబుదామన్నా కుదరలేదు.

మర్నాడు నాన్న అంత్యక్రియలు ముగిసిన సాయంత్రం చుట్టాలెవరూ ఉండకూడదు కాబట్టి ఇంట్లో మేము కుటుంబ సభ్యులం మాత్రమే ఉన్నాము.  మా ఆవిడ ఎవరో వచ్చారని చెప్పింది.  నేను బయటికొచ్చేసరికి మావయ్య ఇంటి ముందు మెట్ల దగ్గర ఉన్నాడు.

చాలా ఏళ్లయ్యింది మావయ్యని దగ్గరగా చూసి.  అలా చూస్తున్న నన్ను "ఏమైందిరా, ఎందుకిలా జరిగింది రా వంశీ"! అంటూ మావయ్య నన్ను పట్టుకుని అక్కడే ఉన్న మెట్ల మీద కూర్చున్నాడు.

నేనూ తల పంకించి దుఃఖం ఆపుకుంటూ నేల చూపులు చూస్తున్నాను.  మా ఇద్దరి మధ్య చాలా అంతరం పెరిగింది.  మాటలు రావట్లేదు.  మావయ్య ఉన్నట్లుండి బావురుమన్నాడు  "మీ నాన్న కూడా వెళ్లిపోయాడేంట్రా" అని నా చేతులు పట్టుకున్నాడు.

నేను తమాయించుకుని మావయ్య భుజం తట్టి అనునయించాను.  "అమ్మని పలకరిస్తావా, రా లోపలికి వెళదాం" అన్నాను.  మావయ్య వద్దని తలూపాడు.

"మంచి నీళ్లు తాగుతావా" అంటే "వద్దురా" అన్నాడు.  మెట్ల మీద నేనూ మావయ్యే కూర్చుని ఉన్నాము.

ఏ సంభాషణ లేకుండా కొన్నినిమిషాలు గడిచాయి.  మావయ్య తల వంచుకుని కళ్ళు మూసుకుని ప్రార్ధన చేస్తున్నట్లుగా ఉన్నాడు.  కొద్ది సేపటికి మావయ్య నన్ను పట్టుకుని నా కళ్లలోకి చూస్తూ "సరే రా. అమ్మ జాగ్రత్త" అని చెప్పి, లేచి వెళ్ళిపోయాడు.

నేను మావయ్య వెళ్లిపోతుండగా అలా చూస్తూ ఉండిపోయాను.  ఇంట్లో లోపల ఉన్న మిగతా వాళ్లకి తెలియకుండానే ఈ నిశ్శబ్ద సమయంలో మావయ్య రావడం ఇంకా దుఃఖిస్తూ వెళ్లిపోవడం జరిగిపోయింది.

వంశీ ఇంకా చెబుతుండగా నేను కల్పించుకుని "ఎందుకురా నీకు విజయ్ బాబు మీద అంత కోపం" అన్నాను.

నా మాటకు చలించిన వంశీ "అదేమీ లేదురా శ్రీమన్!  ఏమని చెప్పను మావయ్య గురించి నేనిప్పుడు? తన జీవితంతో నేను ఎలా ఉండాలో లేక ఉండకూడదో నేర్పాడనా!?

మావయ్య వల్ల కలుగుతున్నఇబ్బందికి అమ్మతో చెప్పే వాడిని.  అమ్మా! నువ్వు మావయ్య వాళ్లకు ఏదైనా

సహాయం చెయ్యాలనుకుంటే ఒకేసారి పెద్దగా చేసేయి. అంతేగానీ పదే పదే మావయ్యొచ్చి ఇబ్బంది పెడితే నాకు చదువు మీద ధ్యాసకి ఆటంకం కలుగుతోందని.

నాకు అనవసరంగా అబద్ధాలాడే వాళ్లంటే తెగ అసహ్యం. మావయ్య వ్యవహారం చూసి నాకు కోపం వచ్చేది. చేతిలో కొన్నిడబ్బులు పడగానే రేపన్నది ఆలోచించకుండా ఉన్న కొద్దిపాటి డబ్బుతో సినిమాలు చూసే మావయ్య కుటుంబమెప్పటికీ బాగుపడదని.

ఇదే కాకుండా నేను బయట ఆడుకోవడానికి వెళ్ళినప్పుడు కొంత మంది పిల్లల తల్లిదండ్రులు, చుట్టాలు, "ఏరా! మీ మావయ్య సంగతేమిటి. ఎందుకు జైలుకెళ్లాడు. ఎప్పుడు తిరిగొస్తాడు?" అని అడుగుతుంటే నాకెంతో అవమానంగా ఉండేది.

ఇదే సమయంలో నాన్నకి హార్ట్ ఎటాక్ వచ్చిన వెంటనే ఒక్కో బాధ్యత త్వరగా పూర్తి చేయాలని అమ్మా నాన్నా భావించి అక్కకి  పెళ్లి సంబంధాలు చూడటం మొదలు పెట్టారు. స్నేహితుల ముందు మావయ్య ప్రస్తావన నేను నామోషీగా భావించడం ప్రక్కన పెడితే, మావయ్య చరిత్ర అక్క పెళ్ళికి ఏమైనా ఆటంకం కలిగిస్తుందేమోనని నాకు చాలా భయంగా ఉండేది.

నేను ఆందోళన చెందాను. ఇది ఎంత సమీప బాంధవ్య విషయమైనా దీనికి ఒక ముగింపు తేల్చకపోతే, దీని పర్యవసానం కుటుంబమంతా ఎల్లప్పుడూ భరించాల్సిందే అని. అమ్మేమో తనకున్నబాధలు చాలక మావయ్య గురించి తలచుకుని మౌనంగా దుఃఖిస్తుండేది.

అసలే సున్నితంగా మారిన నాన్న ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా కూడా దీనికి ఒక శాశ్వత పరిష్కారం కావాలి అనిపించేది నాకు. అందుకే కొన్నాళ్ళు బాధపడ్డా తరువాత ప్రయోజనముంటుందని భావించి, అమ్మ మీద ఆఖరున నా తీవ్ర అస్త్రాన్ని ప్రయోగించాను. అమ్మఎంత చెప్పినా, నేనిక దీన్నిభరించలేను. మావయ్య మన ఇంటికి రావటం ఎప్పటికీ ససేమిరా వద్దన్నాను.

శ్రీమన్! మావయ్య విషయంలో నేను దుర్మార్గంగా ప్రవర్తించానని నువ్వు కూడా భావించినా, నాకు తెలుసు నేను తీసుకున్న అప్పటి కఠిన నిర్ణయంతో దీర్ఘ కాలం మా కుటుంబానికి భారం తగ్గి ప్రశాంతత దొరికిందని.

ఐతే ఒకటి మాత్రం నిజం. మావయ్య తోటి భౌతిక దూరంతో మా కుటుంబానికి ఒక పరిష్కారం లభించినా, మానసికంగా జీవితకాలం మాత్రం రక్త సంబంధంతో కూడిన ప్రేమ, అనుబంధాలు ఎప్పుడో ఒకప్పుడు మావయ్యని గుర్తు చేస్తూనే ఉంటాయి.

శ్రీమన్! చిన్నప్పటి నుండీ మావయ్యతో నా అనుబంధం గురించి కొన్ని సంఘటనలు చెబుతాను విను.

ఊహ తెలిసిన తరువాత బహుశా నాకు అప్పటికి ఐదేళ్ళుంటాయేమో, ఒకసారి మావయ్య మా ఇంటికి వచ్చి

ఒక గదిలో సిగరెట్ తాగుతూ, మా బామ్మ రావడం చూసి వెంటనే దాన్ని ఆర్పేసి ప్రక్కనే ఉన్న బుట్టలో పడేసి తప్పుకున్నాడు. అది గమనించిన నేను కుతూహలంతో ఆ తరువాత సిగరెట్ ముక్కని బుట్టలోంచి తీసి మావయ్యలా నోట్లో పెట్టుకుని ఊదటానికి ప్రయత్నించాను.

ఇంతలో మా అత్త అది చూసి బామ్మకి చెప్పింది. మావయ్యంటే మంచి అభిప్రాయం లేని బామ్మ "చూడు మీ తమ్ముడి నిర్వాకం. వాడు చెడినదే కాక వీడి ప్రభావం మిగతా పిల్లల మీద కూడా ఎలా ఉంటుందో" అని అమ్మతో నిష్ఠురమాడింది.

అంతే! అమ్మకి ఉక్రోషం వచ్చి నన్ను పట్టుకు చితక బాదింది. దీనితో నాకు బుద్ధి రావటమే కాక మావయ్య చెడ్డ పనులు చేస్తాడు అనే భావం బలంగా నాటుకుంది. కానీ తరువాత కాలంలో మావయ్య తెలివితేటలు, ఏ పనైనా నైపుణ్యంతో చక్కగా చేసేయటం నన్ను ఎంతో ఆకట్టుకునేవి.

కొన్నాళ్ళకి నీకు తెలుసు కదా మన స్కూల్ లో పిల్లలు అట్ట ముక్కలతో ఇల్లు కట్టి తీసుకు రావాలన్న క్రాఫ్ట్ పోటీ నిర్వహించారు. నేను కొన్నిఅట్ట ముక్కలు పోగు చేసి ఏదో పిండి జిగురుతో ఒక ఇల్లు కట్టాలని కష్ట పడ్తున్నాను కానీ అస్సలు కుదరట్లేదు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS